# కడుపు నిండిన బేరాలు

మనలోనే కొంతమంది కడుపు నిండిన వాళ్ళుంటారు. కాల్తున్నప్పుడు విప్లవం విప్లవం అంటూ అరిచిన వాడు కడుపు నిండగానే విరహం అంటూ గుసగుసలాడతాడు. ఈ ద్వంద నీతి కోవిదులు న్యాయం, ధర్మం , నీతి అన్నిటినీ తమ పరంగానే ఆలోచించి, అన్వయించకుంటారు. గ్యాసు రావటం రెండ్రోజులు ఆలస్యం అయితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చిరాకు పడిపోయి శాపాలు, శాపనార్ధాలు పెడతారు. అదే పక్కింటి పానకాలరావుకి నెలరోజులయినా గ్యాసు రాలేదంటే సహనం గురించి చిన్న లెక్చరిచ్చి కిరసనాయిలుతో అడ్జెస్టవ్వమని సలహ ఇస్తారు. సమస్యలు కష్టాలు అందరికి ఒకటేనని వీళ్ళు గుర్తించరు. గుర్తించినా మెప్పుగోరు, మనసు చంపుకుని బతకటంలో వీళ్ళు మొనగాళ్ళు ఆడపిల్లకి పెళ్ళి చెయ్యాల్సి వచ్చినప్పుడు వరకట్నం సాంఘిక దురాచారం. అదే కొడుకు పెళ్ళికి దాన్ని సాంప్రదాయం, ముచ్చటా అంటూ మురిసిపోతారు.

ఒకసారి ఒక రాజకీయ నాయకుడిని ఇంటర్వ్యూ చేస్తూ పాత్రికేయుడు ప్రశ్న వేశాట్ట. – నడి వీధిలో మీ కళ్ళముందు ఒక ఆడమనిషిని అమానుషంగా మానభగం చేశారనుకోండి. మీరెలా రియాక్టవుతా' రంటూ – అందుకా నాయకుడు ఓ క్షణం ఆలోచించి ' ముందు అప్పుడు నేను పదవిలో వుంటానా ? ప్రతి పక్షంలో వుంటానా చెప్పం 'డన్నాట్ట. ఇంత తేడా వుంటుంది కడుపునిండటానికి, నిండకపోవడానికి.

సిటీ బస్సుకోసం మనం పడిగాపులు పడి నిల్చున్నప్పుడు బస్సులు ఆగకుండా పోతుంటే, డ్రయివర్లని , కండక్టర్లని, డిపార్టుమెంట్ని, అక్షులు , పక్షులూ అని తిట్టిపోస్తాం. అదే మనం ఎక్కిన బస్సు ప్రతి చోట ఆగుతుంటే, నత్తనడక బస్సులంటూ చిరాకు పడతాం. మన సుఖానికి ,సౌఖ్యానికి అడ్డు తగిలేది ఏదైనా అన్యాయం అక్రమంగా గోచరిస్తాయి. ఈ ధోరణికి రచయితలు, కవులూ అతీతం కాదు. రచనని చదివి రచనా కాలంలో రచయిత కడుపు నిండిందో , కాల్తోందో ఇట్టే చెప్పొచ్చు. రెండు వందల పేజీల నవలలో హీరో వంద పేజీల వరకు నిప్పులుగక్కి , తర్వాత నీళ్ళు కారిపోతే, తప్పు హీరోదికాదు. రచయితదీ ఆవదు. వూళ్ళోలేని రచయిత భార్యది. ఆవిడ నవల

మధ్యలో తిరిగి రావటం. ఇహ కవులు సరేసరి. సమయానుకూలంగా ప్రకృతి, సమాజం మారిపోయి కనిపిస్తుంటాయి వాళ్ళ కళ్ళకి.

బజారుకెళ్ళినప్పుడు చేసే బేరాల్లో కూడా ఈ దోరణి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అప్పుడప్పుడు మనకీ అవసరం లేని వస్తువుల్ని బేరం చేయాల్సి వచ్చినప్పుడు ధీమాగా, ధైర్యంగా పాతికి రూపాయల వస్తువుని అయిదు రూపాయిలకడుగుతాం. వాడివ్వడని తెలుసు. అందుకే ఆ మెహర్బానీ బేరాలు. అదే అవసరం వున్న వస్తువుని రీజన్‌బుల్‌గా అడుగుతాం. కుదరదంటే ఇంకో మాట చెప్పమంటాం. మాకు తెల్సిన ఒక ఇల్లాలు వీధి గడపలో కూర్చుని వచ్చే పోయే కూరల వాళ్ళని పిల్చి తట్టలు దింపించి కిలోల స్థాయిలో బేరాలాడేది. వాడు అయిదు రూపాయలంటే ఈవిడ పావలా అనేది. సాధారణంగా చాలామంది తిట్టుకుంటూ వెళ్ళిపోయేవారు. ఏ ఒకళ్ళిద్దరో తెగించి తీసుకోమంటే కిలోలు నాకెందుకు వంద గ్రాములు ఇమ్మనేది. ఇవన్నీ తోచక చేసే బేరాలు. రైల్లోనో, బస్సులోనో మనం ప్రయాణం చేస్తున్నప్పుడు మన చేతిలో పేపర్ని ఎవరన్న అడిగితే వాడు పేరు కూడా కొనుక్కోలేని వాజమ్మ వెధవ. ఈ దేశం ఎలా బాగుపడుతుందని వర్రీ అయిపోతాం. అదే మనం పేపరు అడిగినప్పుడు సదరు ఓనరు విస్కుంటే వాడు మేనర్‌లెస్ బ్రూట్. విశాల దృక్పధం, జాతీయ భావం తెలీని చచ్చుదద్దమ్మ. అంటే ప్రతి మనిషీ తన కంటికి ఇంపుగాను, తన వొంటికి ఆరోగ్యంగాను , తన ఇంటికి లాభసాటిగాను వుండేటట్టుగా ఈ ప్రకృతి, ఈ ప్రభుత్వం , ఈ ప్రజలు , ఈ న్యాయాలు, ధర్మాలు మారిపోవాలని కోరుకుంటూ వుంటారు. అలా జరిగితే న్యాయం, జరక్కపోతే అన్యాయం అంతే !

------- అయ్యిపోయింది -------